సాక్షి
తూర్పుగోదావరి

ఆదివారం | 28 | సెప్టెంబర్ | 2025



రూ.1.70 లక్షల విరాళం

తొండంగి: రత్నగిరిపై సత్యదేవుని నిత్యాన్నదాన ట్రస్టుకు బాదం చక్రవర్తి, సీతామహాలక్ష్మి దంపతులు (కోరుకొండ మండలం గాదరాడ) శనివారం రూ.1.70 లక్షల విరాళం సమర్పించారు.



నిత్యాన్నదానానికి రూ.59 వేలు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి రాయపురెడ్డి అఖిల్ సాయి శ్రీరామ్ (అమలాపురం) శనివారం రూ.59 వేల విరాళం సమర్పించారు.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: ఖరీఫ్ సాగు అవసరాల నిమిత్తం కాటన్ బ్యారేజీ నుంచి శనివారం గోదావరి డెల్టాలకు 10,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,900, సెంట్రల్ డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు.

న్యూస్‌రీల్

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ సభ్యులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు సీపీఆర్ రెడ్డి అన్నారు. ఈ దిశగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకిస్తూ స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద న్యాయవాదులు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రెడ్డి మాట్లాడుతూ, వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. తొలి విడతలో నాలుగు కళాశాలలను పీపీపీ పద్ధతిలో అప్పగించేందుకు నోటిఫికేషన్ ఇచ్చారని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గానికి ఒక వైద్య కళాశాల మంజూరు చేసి, సామాన్యులకు వైద్య విద్యను అందుబాటులోకి తీసుకు వచ్చారని గుర్తు చేశారు. గత చంద్రబాబు పాలనలో ఒక్క వైద్య కళాశాల కూడా స్థాపించలేదన్నారు. పీపీపీ అంటే ముమ్మాటికీ ప్రైవేటీకరణే నన్నారు. ఇది పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడమేనని, ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని రెడ్డి డిమాండ్ చేశారు.

పుష్కర ఘాట్‌లో ఇద్దరి గల్లంతు



గల్లంతైన బాపిరాజు, వీరబాబు (పాత చిత్రాలు)

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గోదావరిలో స్నానానికి దిగిన ఇద్దరు భవానీ భక్తులు గల్లంతైన సంఘటన స్థానిక పుష్కర ఘాట్‌లో చోటు చేసుకుంది. గోకవరం మండలం పెంటపల్లికి చెందిన గుబ్బల బాపిరాజు (28) వాచ్‌మెన్‌గా పని చేస్తూ రాజమహేంద్రవరంలో ప్రస్తుతం నివసిస్తున్నాడు. రాజానగరం మండలం శ్రీరాంపురానికి చెందిన అతడి బావమరిది రాయుడు వీరబాబు (25) హైదరాబాద్‌లో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. భవానీమాల వేసుకోవడానికి అతడు ఇటీవల ఇంటికి వచ్చాడు. బాపిరాజు, వీరబాబు కుటుంబ సభ్యులతో కలసి శనివారం సాయంత్రం రాజమహేంద్రవరం పుష్కర ఘాట్‌కు వచ్చారు. అక్కడ బాపిరాజు, వీరబాబు స్నానానికి దిగారు. నది లోతు ఎంత ఉందో తెలియక ఊబిలో దిగి ఇద్దరూ గల్లంతయ్యారు. వారి కోసం త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు ఆధ్వర్యాన ఎస్సైలు, సిబ్బంది స్థానిక మత్స్యకారులతో గాలింపు చేపట్టారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటన నేపథ్యంలో పుష్కర్ ఘాట్ గేట్లన్నీ మూసివేశారు. ఎవ్వరూ గోదావరి స్నానాలకు వెళ్లకుండా పోలీసు గస్తీ ఏర్పాటు చేశారు. భవానీ దీక్షధారులు పుష్కర ఘాట్ శివలింగం వద్ద జల్లు స్నానాలు చేస్తున్నారు.

వేలాదిగా.. శృంగార వల్లభుని దర్శనానికి..

పెద్దాపురం: తొలి తిరుపతి గ్రామంలో శృంగార వల్లభ స్వామివారిని సుమారు 30 వేల మంది దర్శించుకున్నారు. వివిధ సేవలు, కేశఖండన టికెట్లతో పాటు అన్నదాన విరాళాలు కలిపి స్వామివారికి రూ.4,77,983 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు.

లక్షణంగా.. లక్ష్మీ కళ ఉట్టిపడేలా..



రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరు – రాజవోలు రోడ్డులోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారు శ్రీమహాలక్ష్మీదేవిగా శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్ర వేడుకల్లో భాగంగా అమ్మవారిని రూ.10 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. కుడిపూడి శ్రీనివాస్, లక్ష్మి దంపతుల ఆధ్వర్యాన రూ.500, రూ 200, రూ.100, రూ.20 కరెన్సీ నోట్లతో అలంకరించారు.

– రాజమహేంద్రవరం రూరల్



దేవీ నవరాత్రులను పురస్కరించుకుని రాజమహేంద్రవరం రాజేంద్ర నగర్‌లో అమ్మవారిని సుమారు రూ.35 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. అమ్మవారితో పాటు ఆలయం లోపలి భాగాన్ని సైతం కరెన్సీ నోట్లతో అలంకరించడంతో ఆ ప్రాంగణం 'లక్ష్మీ' శోభను అద్దుకుంది. శ్రీ కనక దుర్గ భవానీ దీక్షా పీఠం ఆధ్వర్యాన గురు భవాని నీలాద్రి వెంకటరమణ, భక్తుల సహకారంతో ఈ అలంకరణ చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం



దేవీచౌక్ ఉత్సవ మండపంలో ప్రత్యేక పూజలకు తరలివచ్చిన భక్తులు

రాజమహేంద్రవరాన్ని రక్షించే శ్యామలాదేవిగా..

చిరకాలంగా రాజమహేంద్రవరం గ్రామ దేవతగా పూజలందుకుంటున్న తల్లి శ్రీ శ్యామలా దేవి. ఆ అమ్మవారిని భక్తులు సోమాలమ్మ తల్లిగా, శ్యామలాంబగా పిలుచుకుంటూంటారు. శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన శనివారం దేవీచౌక్‌లోని మండపంలో శ్రీ బాలాత్రిపుర సుందరి అమ్మవారు శ్యామలాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఏడాది శరన్నవరాత్రులు తొమ్మిది కంటే ఎక్కువ రోజులు రావడంతో అమ్మవారిని శ్యామలాదేవిగా అలంకరించారు. అమ్మవారికి పెద్ద సంఖ్యలో భక్తులు పూజలు చేశారు.

– సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం)



శ్యామలాదేవి అలంకరణలో బాలాత్రిపుర సుందరీ దేవి

స్టెతస్కోప్ వీడి.. సమ్మెబాటలో..

- కూటమి సర్కారు విధానాలపై అసంతృప్తి
- సమ్మె ప్రారంభించిన పీహెచ్‌సీ వైద్యులు
- ఇప్పటికే ఆన్‌లైన్ సేవల నిలిపివేత
- ప్రభుత్వం స్పందించకుంటే అన్ని వైద్య సేవలూ నిలిపివేయాలని నిర్ణయం

సాక్షి, రాజమహేంద్రవరం: ఏరు దాటేవరకు ఏటి మల్లన్న.. ఏరు దాటాక బోడి మల్లన్న' అన్న చందంగా మారింది చంద్రబాబు, కూటమి నేతల తీరు. సార్వత్రిక ఎన్నికల్లో గట్టెక్కేందుకు గంపెడు హామీలు ఇచ్చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక నెరవేర్చకుండా మానసిక క్షోభకు గురి చేస్తున్నారు. కూటమి ప్రభుత్వ వ్యవహార శైలితో అటు ప్రజలు, ఇటు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ ఒక్క వర్గం ఆనందంగా లేని పరిస్థితి. ఉద్యోగులు తమ డిమాండ్ల పరిష్కారానికి ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు పింఛన్లలో కోత విధించడంతో దివ్యాంగులు రోడ్డెక్కి ధర్నాలు చేసిన దుస్థితి కళ్లకు కట్టింది. తాజాగా ఆ జాబితాలోకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) వైద్యులు సైతం చేరారు. ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించకపోవడంతో వారు తాత్కాలికంగా స్టెతస్కోప్ పక్కన పెట్టి.. సమ్మె బాట పట్టారు.

పట్టింపేదీ..

గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందించడంలో పీహెచ్‌సీలది కీలక భూమిక. అంతటి ప్రాధాన్యం ఉన్న పీహెచ్‌సీ వైద్యులపై కూటమి ప్రభుత్వం కనికరం లేకుండా వ్యవహరిస్తోంది. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని పలుమార్లు విన్నవించినా స్పందించలేదు. చేసేది లేక వైద్యులు సమ్మె బాట పట్టారు. దశల వారీ ఆందోళనకు కార్యాచరణ రూపొందించారు. ప్రభుత్వానికి ఇప్పటికే సమ్మె నోటీసు కూడా ఇచ్చారు. ప్రభుత్వం స్పందిస్తుందని గురువారం వరకూ ఎదురు చూశారు. ఎలాంటి స్పందనా లేకపోవడంతో పూర్తి స్థాయి సమ్మెకు దిగుతామని పేర్కొంటూ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి(డీఎంహెచ్ఓ)కి శనివారం వినతిపత్రం అందజేశారు.

ఇవీ సమస్యలు

- జిల్లావ్యాప్తంగా 40 పీహెచ్‌సీలున్నాయి. వాటిలో 90 మంది వైద్యులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఉద్యోగులకు వ్యతిరేకమైన జీఓ నంబర్ 99 అమలు నిలిపివేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



డీఎంహెచ్ఓకు వినతిపత్రం ఇస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

- పీహెచ్‌సీల్లో వైద్యాధికారులుగా పని చేస్తున్న వారికి పీజీలో 30 శాతం సీట్ల కోటా ఉండేది. దీనిని కూటమి ప్రభుత్వం గత ఏడాది 15 శాతానికి తగ్గించింది. దీనిపై ఆందోళన చేస్తే 20 శాతానికి పెంచింది. ఏటా ఇదే విధానం కొనసాగిస్తుందని వారు భావించగా.. ఒక ఏడాది మాత్రమే అమలు చేసి, ఇప్పుడు పట్టించుకోవడం లేదు. దీనిపై పీహెచ్‌సీ వైద్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- 2020లో రిక్రూట్ అయిన వైద్యులకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాల్సి ఉంది.
- డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలో ఎంతో మంది వైద్యులు ఒకే క్యాడర్‌లో 20 ఏళ్ల నుంచి పని చేస్తున్నా, ప్రమోషన్లు ఇవ్వడం లేదు. గతంలో టైమ్ బౌండ్ ప్రమోషన్లు ఇస్తామని హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు.
- ఏజెన్సీలో పని చేస్తున్న వైద్యులకు 30 శాతం అలవెన్స్ వస్తోంది. అదే ప్రాంతంలో పని చేస్తున్న డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలో ఉన్న వైద్యులకు మాత్రం ఈ అలవెన్స్ ఇవ్వడం లేదు. దీంతో పాటు సీఎస్ఈ అలవెన్స్ సైతం ఇవ్వడం లేదు.
- నోషన్ ఇంక్రిమెంట్లలోనూ కూటమి ప్రభుత్వం మొండిచేయి చూపడంపై ఉద్యోగులు మండి పడుతున్నారు.

ఉద్యమ కార్యాచరణ

ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించేంత వరకూ దశలవారీగా ఉద్యమాన్ని తీవ్రతరం చేయనున్నట్లు వైద్యులు ప్రకటించారు. దీనికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా తొలి రోజైన శనివారం డీఎంహెచ్ఓకు వినతిపత్రం అందజేశారు. పీహెచ్‌సీల్లో అన్ని ఆన్‌లైన్ సేవలకు శుక్రవారం నుంచి బ్రేక్ ఇచ్చారు. శనివారం నుంచి క్షేత్ర స్థాయిలో సంచార చికిత్స, వైద్య శిబిరాలు తదితర సేవలు నిలిపివేశారు. ఆదివారం అన్ని అధికారిక వాట్సాప్ గ్రూపుల నుంచి ఎగ్జిట్ అవుతారు. సోమవారం ఓపీ సేవలు బహిష్కరిస్తారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కాన్పులు, పాము కాటు తదితర అత్యవసర వైద్య సేవలు అందిస్తారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి ఆందోళన కార్యక్రమాలు చేపడతారు. వచ్చే నెల 1న జిల్లా కేంద్రంలో ప్లకార్డులు చేబూని ర్యాలీ, ధర్నా నిర్వహిస్తారు. వచ్చే నెల రెండో తేదీన చలో విజయవాడ నిర్వహిస్తారు.

స్పందించకపోతే ఆందోళన తీవ్రతరం



గ్రామీణ ప్రజలకు వైద్యం అందించే మా సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తాం. ప్రస్తుతం రోగులకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోతే ఆందోళన ఉధృతం చేయక తప్పదు. ఇప్పటికే ఉద్యమ కార్యాచరణ రూపొందించాం.

– డాక్టర్ మౌనిక, జిల్లా అధ్యక్షురాలు, పీహెచ్‌సీ వైద్యుల సంఘం

ఉగ్ర గోదారి



రాజమహేంద్రవరం పుష్కరాల రేవు వద్ద ఉగ్రరూపం దాల్చిన గోదావరి

ధవళేశ్వరం: ఎగువ నుంచి భారీగా వస్తున్న వరద ఉధృతితో ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చుతోంది. బ్యారేజీ నుంచి శనివారం ఉదయం 9 గంటలకు 6 లక్షల క్యూసెక్కుల మిగులు జలాలను విడిచిపెట్టగా.. సాయంత్రం 5 గంటలకు అది ఏకంగా 10 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. వరద ఉధృతి మరింతగా పెరగడంతో బ్యారేజీ వద్ద నీటిమట్టం రాత్రి 8 గంటలకు 12.10 అడుగులకు చేరింది. బ్యారేజీ నుంచి 10,25,075 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. డెల్టా కాలువలకు 10,300 క్యూసెక్కులు విడుదల చేశారు. వరద ఉధృతి పెరుగుతూండటంతో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి బ్యారేజీని సందర్శించి, పరిస్థితిని సమీక్షించారు. ప్రవాహ ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరీవాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో గోదావరి వరద మరింత పెరిగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఫ్లడ్ కంట్రోల్ రూము నుంచి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.



బ్యారేజీ వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

ఎగువ ప్రాంతాల్లో గోదావరి నీటిమట్టాలు (మీటర్లలో)

కాళేశ్వరం	10.70	కూనవరం	19.15
పేరూరు	15.18	కుంట	10.85
దుమ్ముగూడెం	11.96	పోలవరం	12.40
భద్రాచలం	44.50 అడుగులు	రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి	16.16

క్లుప్తంగా

ప్రైవేటీకరణతో పేదలకు వైద్య విద్య దూరం



కలెక్టర్ మహేష్ కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు గోవిందరావు

అమలాపురం రూరల్: పీపీపీ మోడల్‌లో టీడీపీ పారిశ్రామిక వేత్తలు, తన తాబేదార్లకూ సీఎం చంద్రబాబు ప్రభుత్వ మెడికల్ కళాశాలను అప్పగించడం వల్ల పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తుందని జిల్లా వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు, న్యాయవాది టీవీ గోవిందరావు కలెక్టర్ మహేష్‌కుమార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. రూ.8 వేల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను ఏడాదికి కేవలం రూ.5 వేలకే ప్రైవేటు సంస్థలకు లీజుకు ఇవ్వడం ద్వారా ప్రజల ఆస్తులను దోచుకుంటున్నారని అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు కూటమి ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసి తొలి విడతలో నాలుగు కాలేజీలను పీపీపీ పద్ధతిలో అప్పగించేందుకు టెండర్ నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. ఇందులో భాగంగా ఆదోని, మార్కాపురం, మదనపల్లె, పులివెందుల కాలేజీలను అప్పగించేందుకు నోటిఫికేషన్ జారీ చేశారని అన్నారు. మెడికల్ కాలేజీలు, 625 పడకల సూపర్ స్పెషలిటీ ఆస్పత్రుల పీపీపీకి టెండర్లను పిలిచిందని, కమీషన్ల కోసం మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అమ్మేస్తున్నారన్నారని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. 2019–24 కాలంలో 17 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణానికి అప్పటి సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే శ్రీకారం చుట్టారని అన్నారు.

ఏ కాటు రేబిస్ కానుందో!

తన చూపులతో.. చేష్టలతో మనుషులను వశం చేసుకునే పెంపుడు జంతువులలో కుక్క ఒకటి. ఒక్కసారి దాని ప్రేమకి లొంగిపోతే పరోక్షంగా ఆ యజమాని లేదా ఆ ఇంటి వారు దానికి బానిసలైపోయినట్టే. దానిని నెత్తినెక్కించేసుకుంటారు. ఈ ప్రేమ, వశం మాటున పెద్ద ప్రమాదం పొంచి ఉందని ఆ దాని మాయలో పడినవారికీ.. ఆ మూగజీవికి సైతం తెలియదు. తెలిసినా ఎక్కువ శాతం ఆ ప్రమాదాన్ని విస్మరిస్తారు. దాని పోషణ ఎంత ముఖ్యమో.. దాని ఆరోగ్య విషయంలోనూ అంతే జాగ్రత్త తీసుకోవాలంటారు వైద్యులు. ఆ జీవి చొంగ కానీ.. కంటి నీరు కానీ ఎంతో ప్రమాదకరమైనవి. మితిమీరి ప్రేమించేవారు దాని ముక్కుమీద.. నోటి మీద ముద్దులిస్తుంటారు. అంతే కాకుండా దానికి అన్నం సైతం నోట్లో పెట్టి తినిపిస్తారు. ఈ విషయంలో అత్యంత జాగ్రత్త వ్యవహరించాల్సిన ఆవశ్యకత ఉంది. దాని నుంచి ఎటువంటి వ్యాధులు సంక్రమించకుండా.. నిర్ణీత కాల వ్యవధిలో ఏఆర్వీ ఇంజెక్షన్లు, టీకాలు, ఏ అనారోగ్యం వచ్చినా మందులు ఇప్పించాలి. లేదంటే ఆ ప్రేమ చూపించే మూగజీవే ప్రాణాంతకం కావచ్చు.

- కుక్కలతో అప్రమత్తం అంటున్న వైద్యులు
- ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 3,794 కేసులు
- నేడు వరల్డ్ రేబిస్ డే

రాయవరం: జంతువులు, మనుషుల్లోను వచ్చే అతి ప్రాణాంతక వ్యాధి రేబిస్. అత్యంత ప్రమాదకరమైన వైరల్ వ్యాధుల్లో ఇది ఒకటి. దీనినే లిస్సా హైడ్రోఫోబియా అని కూడా అంటారు. ఈ వ్యాధి సోకిన జంతువులు కరవడం వల్ల మనుషులకు కూడా ఆ వ్యాధి వ్యాపిస్తుంది. కుక్కకాటు ద్వారా సంక్రమించే అతి పురాతనమైన వ్యాధి ఇది. రేబిస్ నివారణకు ప్రయత్నాలు జరుగుతున్నా నేటికీ అదుపులోకి రాకపోగా చాలా మందిని ఇది పొట్టన పెట్టుకుంటోంది. పిచ్చి కుక్క కరవడం ద్వారా వచ్చే రేబిస్ వ్యాధికి సకాలంలో చికిత్స చేస్తే పూర్తిగా నివారించే వీలుంటుంది.

వ్యాధి లక్షణాలు రెండు రకాలు

■ ఉగ్రరూపం

ఈ దశలో జంతువు విపరీతమైన ఆందోళనగా ఉంటుంది. ప్రతి ఒక్కరినీ విచక్షణా రహితంగా కరుస్తూ యజమానిని గుర్తించలేదు. రాళ్లు, కర్రలు తదితర వాటిని తినడానికి ప్రయత్నిస్తుంది. ఆహారం తినదు. కళ్లు ఎర్రబడి వుండి నోటి నుంచి చొంగ విపరీతంగా కారుతుంది. గొంతు కండరాలకు పక్షవాతం వచ్చి గొంతు బొంగురు పోతుంది. నీరు తాగలేదు. అరుపులో మార్పు వస్తుంది. పిచ్చిగా పరుగులు తీసి గోడలను రుద్దు కుంటుంది. దవడలు బిగుసుకు పోతాయి. సాధారణంగా ఈ లక్షణం పిల్లుల్లో వస్తుంది.

ఐదేళ్ల వ్యవధిలో కుక్క కాట్లు, మరణాల సంఖ్య ఇలా

సంవత్సరం	డాగ్ బైట్స్	రేబిస్ కేసులు	రేబిస్ డెత్స్
2021	4,378	0	0
2022	5,562	0	0
2023	5,215	0	0
2024	4,559	1	1

2025 జనవరి నుంచి నేటి వరకు 3,794 కుక్క కాటు కేసులు నమోదయ్యాయి.



ప్రమాదకరంగా వ్యవహరించే సందర్భంలో..



తన పప్పీ ప్రేమను ఆస్వాదిస్తున్న చిన్నారి

■ మూగతనం

రేబిస్ సోకిన జంతువుకి కింద దవడ వేలాడుతుంది. వ్యాధి లక్షణాలు అంతగా కనిపించవు. ముందుగా పక్షవాతం లక్షణాలు కన్పిస్తాయి. కరవలేదు. కుందేళ్లలో ఈ లక్షణం కన్పిస్తుంది.

వ్యాధి నివారణ చర్యలు

- వ్యాధికి చికిత్స లేదు. వ్యాధి నిరోధక టీకాలు (పోస్ట్ బైట్) వేయించుకోవాలి.
- రేబిస్ సోకిన కుక్క లేదా అడవి జంతువుల ద్వారా అయిన గాయాలకు వెంటనే చికిత్స చేయించాలి. యాంటీ రేబిస్ ఇమ్యునో గాబులిన్స్ ఇప్పించాలి.
- కుక్క కరిచిన గాయాలను శుభ్రంగా డిటర్జెంట్ సబ్బుతో కడగాలి.
- కార్బలిక్ యాసిడ్, టింక్చర్ అయోడిన్‌ను గాయంపై పూయాలి. యాంటీ రేబిస్ ఇమ్యునో గ్లాబ్యులిన్స్ ఇంజక్షన్ ఇవ్వాలి.
- యాంటీ రేబిస్ పోస్టుబైట్ కోర్సు 0, 3, 7, 14, 28, 90 రోజుల్లో క్రమం తప్పకుండా వ్యాక్సిన్ చేయించుకోవాలి.
- పెంపుడు కుక్కల యజమానులందరూ తప్పనిసరిగా తమ కుక్కలకు యాంటీరేబిస్ వ్యాక్సిన్ ఇప్పించేలా చట్టబద్ధం చేయాలి.
- వీధి కుక్కలకు గర్భనిరోధక ఆపరేషన్లు చేసే కార్యక్రమాలను బ్లూక్రాస్ వంటి సంస్థల సహకారంతో చేపట్టాలి.
- ఇతర దేశాలు, ప్రాంతాల నుంచి కుక్కలను తీసుకువచ్చే సమయంలో వాటికి తప్పనిసరిగా వ్యాక్సినేషన్ సర్టిఫికేట్ ఉండేలా చూడాలి.
- రేబిస్ లక్షణాలు, వ్యాప్తి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. అలాగే రేబిస్ కేసుల గురించి తప్పనిసరిగా ఎప్పటికప్పుడు అధికారులకు సమాచారం ఇవ్వాలి.
- వెటర్నరీ, మెడికల్, మున్సిపల్ శాఖలు కలిసికట్టుగా రేబిస్ వ్యాధి నిరోధానికి చర్యలు చేపట్టాలి.

యాంటి రేబిస్ టీకా

పిచ్చికుక్క కరిచిన ఒక బాలుడికి 1885వ సంవత్సరంలో లూయిస్‌పాశ్చర్ అనే శాస్త్రవేత్త మొదటి సారిగా యాంటి రేబిస్ టీకా వేశారు.


పెరిగిపోతున్న కుక్కల సంతతి

ఇటీవలి కాలంలో కుక్కల సంతతి బాగా పెరిగిపోవడంతో పలువురు కుక్కకాటు బారిన పడుతున్నారు. ఈ వ్యాధి వల్ల జిల్లాలో ఏటా వేల సంఖ్యలో కుక్కకాట్లకు గురవుతున్నారు. మనుషులే కాదు పశువులు కూడా కుక్క కాటు బారిన పడుతున్నాయి. జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు 26వ తేది వరకు 3,794 మంది కుక్కకాటు బారిన పడ్డారు. ఈ వ్యాధికి సకాలంలో చికిత్స చేపడితే పూర్తిగా నివారించవచ్చునని వైద్యులు చెబుతున్నారు.

వ్యాధి స్వరూపం ఇదీ..

రేబిస్ వ్యాధి రెబ్డో వైరస్ వల్ల వస్తుంది. ఈ వ్యాధి సోకిన పశువు లేదా జంతువు కరవడం వల్ల ఇది వ్యాపిస్తుంది. రేబిస్ వ్యాధి ఎక్కువుగా కుక్కల వలనే వస్తుంది. వాటిలో లాలాజలం కళ్లు, ముక్కు, పుండు స్రావాల్లో ఉన్న వైరస్ ఆ జంతువు కరచిన ప్రదేశం నుంచి కేంద్ర నాడీ మండలం ద్వారా మెదడుకు చేరి అక్కడ లాలాజల గ్రంధులకు చేరుతుంది. రేబిస్ వ్యాధిని పిచ్చి కుక్క వ్యాధి, హైడ్రో ఫోబియా (నీళ్లంటే భయపడడం) అని కూడా పిలుస్తారు.

వెంటనే వైద్యులను సంప్రదించాలి



కుక్క కాటుకు గురైన వ్యక్తి వెంటనే వైద్యులను సంప్రదించాలి. కుక్క కరిచిన చోట సబ్బుతో 10–15 నిమిషాలు సబ్బుతో కడగాలి. కచ్చితంగా యాంటీ రేబిస్ టీకాలు వేయించాలి. రేబిస్ వ్యాధి నివారణ ఒక్కరి వల్ల సాధ్యం కాదు. కుక్కల సంతతిని వ్యాక్సినేషన్ ద్వారా కట్టడి చేయాలి. మీరు..నేను.. సమాజం అనే స్లోగన్‌తో రేబిస్ నివారణ దినోత్సవాన్ని ఈ ఏడాది నిర్వహిస్తున్నారు.

– డాక్టర్ ఆర్‌బీ ప్రతాప్, జిల్లా సర్వైలెన్స్ అధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

- 220.966 గ్రాముల బంగారం, 8.25 గ్రాముల వెండి వస్తువులు రూ.4.21 లక్షల నగదు స్వాధీనం
- సొత్తు విలువ రూ.9,98,415
- డీఎస్పీ భవ్యకిషోర్

రాజమహేంద్రవరం రూరల్: కరుడుగట్టిన ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసి వారి నుంచి 220.966 గ్రాముల బంగారం, 8.25 గ్రాముల వెండి వస్తువులు, రూ.4.21 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామని జిల్లా సౌత్ జోన్ డీఎస్పీ, ఈస్ట్‌జోన్ ఇన్‌చార్జి డీఎస్పీ ఎస్.భవ్యకిశోర్ తెలిపారు. మొత్తం సొత్తు విలువ రూ.9,98,415 ఉంటుందని ఆయన అన్నారు. బొమ్మూరు పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. దివాన్‌చెరువు డీబీవీ రాజు లే అవుట్‌లో నివసిస్తున్న క్యానమ్ అన్వేష్ తన తల్లి అస్తికలను గంగానదిలో కలపడానికి గత నెల 24వ తేదీన కాశీ వెళ్లి తిరిగి 27న వచ్చారు. అప్పుడు బీరువాలోని బంగారు వస్తువులు, నగదు చోరీకి గురైనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బొమ్మూరు ఎస్సై మురళీమోహన్ కేసు నమోదు చేశారు. ఎస్పీ డి.నరసింహకిశోర్ ఆదేశాల మేరకు జిల్లా అడిషనల్ ఎస్పీ(క్రైమ్) అర్జున్ పర్యవేక్షణలో ఈస్ట్ జోన్ డీఎస్పీ ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ పి.కాశీవిశ్వనాథ్‌కు వచ్చిన సమాచారం మేరకు డీఎస్పీ భవ్యకిషోర్ పర్యవేక్షణలో సిబ్బంది ఒడిశా రాష్ట్రం బరంపురానికి చెందిన ప్రస్తుతం భువనేశ్వర్‌లో ఉంటున్న కారాడ ప్రశాంత్‌కుమార్, గంజాం ప్రాంతానికి చెందిన సాగర్‌కుమార్ పాండాను శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

2000 నుంచి నేరాల బాట : నిందితులు ప్రశాంతకుమార్, సాగర్‌కుమార్ పాండాలు 2000 సంవత్సరం నుంచి నేరాలు ప్రారంభించారని డీఎస్పీ భవ్యకిశోర్ తెలిపారు. విశాఖపట్నం పరిధిలో 11, కాకినాడ పరిధిలో నాలుగు, గుంటూరు పరిధిలో మూడు, ఒడిశా బరంపురంలో ఐదు, బైద్యనాథ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు, బడాబజార్ పోలీస్‌స్టేషన్ పరిదిలో ఐదు, గుస్పాన్ నుగవు పోలీసు స్టేషన్ పరిధిలో ఎనిమిది, హైదరాబాద్ కూకట్‌పల్లిలో ఆరు, నాగ్పూర్ ప్రతాప్‌నగర్‌లో ఆరు మొత్తం 56 కేసులు వీరి మీద ఉన్నాయన్నారు. నిందితులను రిమాండ్ కోసం ఆరో అదనపు ఫస్ట్ క్లాస్‌మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచనున్నట్టు తెలిపారు. ఈ కేసులో ప్రతిభ చూపిన ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథం, ఎస్సై మురళీమోహన్, బొమ్మూరు పీఎస్ హెచ్‌సీ పి.వెంకటేశ్వరరావు, సీసీఎస్ పీఎస్ హెచ్‌సీలు ఎం.ప్రసాద్, డి.వెంకటరమణ, పీసీలు కె.సురేష్ బాబు, ఎ.మణికంత, ఎఆర్‌పీసీ బి.హరీష్, వుమెన్ పీసీ పూర్ణిమరాజ్‌లను ఎస్పీ డి.నరసింహకిశోర్ అభినందించారని డీఎస్పీ భవ్యకిషోర్ తెలిపారు.



అరెస్టు చేసిన నిందితులు, స్వాధీనం చేసుకున్న సొత్తుతో డీఎస్పీ భవ్యకిశోర్, ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథం, సిబ్బంది

వాడపల్లి.. జనసంద్రం



వాడపల్లి క్షేత్రంలో ఏడు ప్రదక్షిణలు చేస్తున్న భక్తజనం

- భక్తులతో పోటెత్తిన వేంకటేశ్వర క్షేత్రం
- మార్మోగిన గోవింద నామస్మరణ
- ఒక్కరోజు ఆదాయం రూ.52.36 లక్షలు

కొత్తపేట: కోనసీమ తిరుమలగా ఖ్యాతికెక్కిన వాడపల్లి క్షేత్రానికి శనివారం భక్తజనం పోటెత్తారు. ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవీ, భూదేవి సమేత వేంకటేశ్వరుని క్షేత్రానికి తెల్లవారుజాము నుంచే భక్తుల రాక మొదలైంది. శుక్రవారం రాత్రి నుంచే ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి భక్తులు కాలినడకన వాడపల్లికి చేరుకున్నారు. సాధారణ భక్తులతో పాటు అత్యధిక సంఖ్యలో 'ఏడు శనివారాలు – ఏడు ప్రదక్షిణల' నోము ఆచరిస్తున్న భక్తులతో ఆ క్షేత్రం నిండిపోయింది. పలువురు భక్తులు మోకాళ్లపై ప్రదక్షిణలు చేశారు. గోవింద నామస్మరణతో వాడపల్లి క్షేత్రం మార్మోగింది. ఆలయ ఈఓ నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షణలో ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంతశ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితుల బృందం విశేష పూజలు చేసి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అత్యధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాన్ని కూడా స్వీకరించారు. వివిధ సేవల ద్వారా దేవస్థానానికి రూ.52.36 లక్షల ఆదాయం వచ్చినట్టు ఈఓ చక్రధరరావు తెలిపారు. రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఎస్సై రాము పోలీస్ సిబ్బందితో ప్రత్యేక పోలీసు బందోబస్తు నిర్వహించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా క్రమబద్ధీకరించారు.

అంబేడ్కర్ నడయాడిన ఈలి వాడపల్లి



రామచంద్రపురంలో టాప్‌లోని కారులో అంబేడ్కర్‌ను ఊరేగిస్తున్న స్థానికులు (ఫైల్)



ఈలి వాడపల్లి ఆశ్రమంలో విద్యార్థులు

నేటికి 81 ఏళ్లు పూర్తి

రామచంద్రపురం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రామచంద్రపురంలో పర్యటించి నేటికి 81 ఏళ్లు పూర్తయ్యింది. 1944 సెప్టెంబర్ 28న ఆయన స్థానిక ఈలి వాడపల్లి ఆశ్రమానికి వచ్చారు. తాళ్లరేవు మాజీ ఎమ్మెల్యే, దళిత నాయకుడు ఈలి వాడపల్లి 1944లో అంబేడ్కర్‌ను జిల్లా ప్రజలకు పరిచయం చేసేందుకు జాతికి నూతన చైతన్యాన్ని, స్ఫూర్తిని కలిగించేందుకు జిల్లాకు ఆహ్వానించారు. ఆ మేరకు ఆయన కాకినాడ రాగా అక్కడ ఏనుగుపై ఆయనను కూర్చుండబెట్టి వేలాది దళితులు, పుర ప్రముఖుల సమక్షంలో ఊరేగించారు. అనంతరం వాడపల్లి ఆశ్రమాన్ని సందర్శించారు. ఆయనకు కుయ్యేరు గ్రామానికి చెందిన దండంగి గంగమ్మ స్వాగతం పలికారు. రామచంద్రపురంలో వంద ఎడ్ల బండ్లను అలంకరించి గారడీలు, డప్పుల బ్యాండ్‌లు, కోలాటాలతో టాప్ లేని కారు మీద అంబేడ్కర్‌ను ఘనంగా ఊరేగింపుగా వాడపల్లి ఆశ్రమానికి వచ్చారు. అక్కడ దళిత విద్యార్థుల చదువు, పోషణ తదితర వివరాలను అడిగి తెలుసుకుని వాడపల్లిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన వాడపల్లి పెద్ద కుమారునికి ప్రేమప్రసాద్ అనే నామకరణం చేశారు. అనంతరం ఢిల్లీకి తిరుగుపయనమయ్యారు.

ఆయన స్మారకంగా తపాలా కవరు

అంబేడ్కర్ రామచంద్రపురం పర్యటనను పురస్కరించుకుని తపాలా శాఖ 2021 సెప్టెంబర్‌లో ప్రత్యేక తపాలా కవర్‌ను విడుదల చేసింది. దీనిని అప్పటి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో విడుదల చేశారు.